# అమ్మా!
# నాకు మంచి పిల్లలు పుడితే చాలుగదా?

సదా చిరునవ్వు లాస్యం చేస్తున్న వదనం డేనియల్ మాస్టారుది. రహస్యంగా అడిగినప్పుడు వారి సహధర్మ చారిణి ''నిద్రలో కూడ ఆయన ముఖం మీద ఒక చిరునవ్వు వుంటుదయ్యా'' అని చెబుతుంది. దాన్ని గురించి, డేనియల్ మాస్టర్ని అడిగితే ఆయనకు చాలా ప్రియమైన కొన్ని జీవిత సిద్ధాంతాలలో, అతి సామాన్యమైన ఒక విషయం గుఱించి, ఎంతో సులువుగా ఐదారు నిముషాలపాటు ప్రసంగం సాగిస్తారు.

''ఎవరికైనా, ఎప్పుడైనా ఇవ్వగలిగిన పెట్టుబడి అవసరం లేని ఆస్తే గదా అది?'' ఏవేవో వికారాలు మన మనసును ఆవరించి వున్నాయని అందరికి తెలియజేయాలా? మనం ముఖం అదోలా పెట్టుకొని కూర్చుంటే, దానివల్ల మనకు గానీ, వేరేవాళ్ళకుగానీ ఏమైనా లాభముందా? మన దుఃఖాలు, బాధలూ అన్ని బయటకు రాకుండా మనలోనే ఇముడ్చుకొనే శక్తి మనకుండాలి. అలా కాకుండా అదంతా ముఖంపై పూసుకొని వుండడం అనవసరం కదా? ఒకవేళ మనకు హృదయ భారం ఉన్నా, దాన్ని కొంత తగ్గించుకోడానికి, మరొకరితో పంచుకోవలసి వస్తే, అది ఒక చిరునవ్వుతో చేయ వచ్చు గదా? బాధల్ని ప్రకటించడం ఒక ఏడుపు మొహంతో మాత్రమే సాధ్యమవుతుం దని అనుకోవడమే తప్పు. సహనశీలత ఉన్న వాడికి, ఏ విషమ సమస్యనైనా దాటడం కష్టమైన పనికాదు.

ఈ లోకంలో మనం దాటవలసింది, అతి క్లుప్తమైన ఒక్క జీవిత కాలం మాత్రమే. అందులో కొంతదూరం కంటక మార్గమై, మన పాదాలకు నొప్పి పుడితే పుట్టనీ! కాని, ఆ నొప్పిని, ఐదడుగుల దూరంలోవున్న మన ముఖం మీదికి తీసుక రాకుండా వుండడమే మంచింది. మన మనసులో వున్నది, మనకు తెలియకుండానే మన ముఖంమీద ప్రతిబింబిస్తుందని చాలామంది అంటారు. కాని ఈ విషయంలోనే మన నిగ్రహశక్తికి పదును పెట్టాలి. ఈ లోకంలో వున్న సకల మానవులు మనసులో వున్న వికారాలన్నింటినీ ప్రకటిస్తూ పోతుంటే, ఈ భూమ్మీద జీవితం పరమ అసహ్యంగా మారుతుంది. మనం కోరే అన్ని సుఖాలు ఈ చిన్ని జీవితం మనకు ప్రసాదించాలంటే అసాధ్యం. ఎవరూ కోరుకోని అసౌకర్యాలు, అసుఖాలు, దుఃఖాలు పిలవని పేరంటంగా మనల్ని ఎప్పటికప్పుడు చుట్టుముడుతూనే ఉంటాయి. కొంతమందికి వాళ్ల అత్త గార్లు ఇంటికి రావడం అయిష్టంగా వుండవచ్చు. అలాగని వాళ్లు వచ్చినప్పుడు, ఆముదం తాగినట్లు మొహం పెట్టుకుంటే వాళ్ల దాంపత్య జీవితం ఏం కావాలి? అంటే మనమంతా కపట నాటకం ఆడాలని కాదు నేను చెప్పేది. మనకు ఎంత మనక్షోభ ఉన్నా, ఎంత అసుఖం ఉన్నా మన ముఖంలో ప్రసన్నతకు ఎలాంటి లోటు లేకుండా

వుండడానికి కావలసిన బలమైన ఒక నిగ్రహ శక్తిని మనం సంపాదించుకుంటే, అది ఈ లోకానికి మనం ప్రదానం చేసే ఒక గొప్ప సంతోషదాయకమైన వరం అవుతుంది. ఎన్ని బాధలున్నా, పసిపాప నవ్వు చూస్తే, అన్ని దుఃఖాల్నీ తాత్కాలికంగా మఱచిపోతాం గదా? అలాగని మనం నవ్వితే, ఎదుటి వాళ్లకు అదే ప్రతిస్పందన రాకపోవచ్చు. కానీ, నవ్వుకు మాత్రం ఒక సార్వత్రికమైన రామణీయకత (హృద్యత) వుంది. చిరునవ్వు ఎవరిదైనా కానీయండి, ఎదుటి వాళ్లకు హాయినిస్తుంది (సుఖ, సంతోషాలనే మణులను వెదజల్లకుండా వుండదు). సర్వమానవ వదనాలలో, ఈ చిరునవ్వుల దివ్వెలు కనిపిస్తే (దర్శితమైతే) దుఃఖాలు, అసుఖాలు, అసౌకర్యాలు అన్నీ పటాపంచలౌతాయని నేను అనడం లేదు. కాని, వాటిలో కనీసం కొన్నైనా కనుమరుగౌతాయన్నది ఖాయం. ఈ భూమ్మీద జీవితం సుఖప్రదం కావడానికి, ఒక దివ్యౌషధం చిరునవ్వు.

నేను నిద్రపోయేటప్పుడు మాత్రమే కాదు, ఈ లోకంనుంచి సెలవు తీసుకొనే అంతిమ నిద్రా వేళలో కూడ, నాముఖం మీద మందహాస ఛాయలు వుండాలనీ తొణికిసలాడాలనీ నేను దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను.''

అయితే, ఉత్తుత్తి వేద ప్రసంగం చేసేవాడు కాధు మన డేనియల్. తను చెప్పేదంతా, తన జీవితంలో తు.చ తప్పకుండా ఆచరించేవాడు. మూడు దశాబ్దాలపైన ఎంతో మంది విద్యార్థినీ విద్యార్థులకు జ్ఞాన, విజ్ఞానాలను అందించాడు. ప్రభుత్వ పాఠశాలలో టీచరు ఉద్యోగం చేస్తున్న కాలంలోను, ఉద్యోగ విరమణానంతరం కూడా, ఆయన ఎంతో ఆదర్శనీయం, ఆరాధ్య ప్రాయమయిన జీవన రీతిని అవలంభించుకున్నాడు. యవ్వన ప్రాయంలో, టపాకాయల వరుసలకు నిప్పు పెట్టినట్టు నవ్వేవాడు. ఇతరులను కూడా అలాగే నవ్వేట్టు చేసేవాడు. నవ్వు సృష్టించేవాడు. కాలక్రమేణ అలాంటి నవ్వులు మామూలు నవ్వులకు దారితీశాయి. నవ్వులకు పరిపక్వత వచ్చినా లేక వార్ధక్యం దగ్గర పడినా అవి చిరునవ్వులుగా రూపాంతరం పొందుతాయి కాబోలు.

మంచి శరీర సౌష్టవం, చురుకుదనం ఉన్న ఆ పంతులుగారికి రిటైర్ అయిన తర్వాత, ఆయన స్వభావంలో కాకపోయినా దేహారోగ్యంలో చాలా పెద్ద వ్యత్యాసం వచ్చింది. ఆయన మనసులో దాచుకున్న బాధలు, వైషమ్యాలు లోపల్లోపలే శరీరంలోని మాంసకృత్తుల్ని హరించి వేశాయేమో మరి. అంతకుముందున్న శారీరక దారుఢ్యం, చురుకు దనం ఉద్యోగ విరమణానంతరం, రెండు మూడు సంవత్సరాలలో, జారిపోయి నట్లున్నాయి. ముఖ ప్రసన్నతను, ఎప్పటిలాగే వుంచడానికి, ఆయన ఎంతో ప్రయత్నం చేస్తున్నట్టు కనబడుతుంది. కాని ఎప్పుడూ అస్తమించని, ఆయన చిరునవ్వు, పాలిపోయిన విషయం మాత్రం వాస్తవం.

డేనియల్, మరియమ్మ దంపతులకు మొదటి సంతానమైన పాప పుట్టినప్పుడు, వాళ్ళిద్దరూ చాలా సంతోషించారు. రెండోసారి కూడా ఆడ బిడ్డ పుట్టినందుకు డేనియల్ మాస్టారుకు దుఃఖం, విచారం, అసంతోషం కలగలేదు; కాని, మరియమ్మకు ఏడవ కుండా వుండడానికి మాత్రం సాధ్యం కాలేదు. మూడో ప్రసవంలో కూడా కూతురే పుట్టిందని తెలుసుకున్న మరియమ్మకు కొద్దిసేపు స్పృహ తప్పింది. ఆ కారణంవల్ల డేనియల్ మాస్టారు తన మూడో కూతురును మర్నాడు ఉదయం మాత్రమే చూడగలిగాడు.

ఆ అర్ధరాత్రి ప్రసవం తర్వాత, తన ప్రాణప్రియ స్పృహ తప్పడంవల్ల ఆయన తన లోకమే అస్తమించి పోతుందా అని భయపడ్డాడు. ఆరాత్రి అంతా ఒక్క క్షణం కూడా నిద్రపోకుండా ఆమె ప్రక్కనే కూర్చుని గడిపాడు. అరగంటలోపల స్పృహలోకి తిరిగి వచ్చిన మరియమ్మ, తన నవమాసాల గర్భాశయ భారం ఒక మృత శిశువుగా జన్మించినట్లు వెక్కి వెక్కి ఏడ్చింది. ఆమెను ఓదార్చడానికి, ఆ పంతులుగారి భాషాపరిజ్ఞానం చాలలేదు. ఆ తల్లికి, ఆడపిల్లలంటే ఇష్టం కాదని కాదు. కాని దుఃఖం వచ్చింది; ఒక కొడుకును లాలించాలనే వ్యామోహం ప్రతి ప్రసవంలో పెరుగుతూనే రావడం దానికి కారణం. ఒక కొడుకును కనడానికి కావలసిన శక్తి తనకు తగ్గిపోతుందనే నిరాశ ఆమెలో అద్భుత రోగం మాదిరి వ్యాపిస్తూ వచ్చింది. అంటే ఆమె ఎక్కువ సార్లు ప్రసవించిందని కాదు, ఇద్దరు బిడ్డలను పోషించడానికే తగిన ఆర్థిక స్తోమత లేని, ఆ దంపతులకు, మూడోసారి కూడా ఆడబిడ్డ పుట్టడం దుఃఖ కారకమయింది. కొడుకు కోసం మరో ప్రయత్నం చేయడం తప్పని ఆమెకు తెలుసు. అయితే, ఇక మగబిడ్డ ఎలా దొరుకుతాడు? ఆ సుందర స్వప్నం తన జీవితంలో నిజంకాదా? అయితే తనింక బ్రతికి ఏం ప్రయోజనం?

మరియమ్మ మనో వేదనను, మనో కామనను, బాగా అర్థం చేసుకున్న, డేనియల్ మాస్టారు, చేయాల్సిన పనిని మాత్రం ఆలస్యం చేయకుండా చేశాడు. తాను కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్న విషయం భార్యకు తెలియకుండా జీవి తాంతం రహస్యంగా వుంచడానికి ఆయన నిర్ణయించుకున్నాడు.

ఆ విధంగా తీరని స్వప్నంతో ముగ్గురు ఆడపిల్లల భారం మోసుకొని మరియమ్మ సంవత్సరాలు గడిపింది. ఆమె స్వప్నం అపుష్పితంగా ఉండటానికి కారణం తానే అనే పాప భారమనే శిలువను భుజస్కంధాలపై మోస్తూ తన కుటుంబంలో దైనంది నంగా ఎదురయ్యే ఖర్చుల ఇబ్బందులనే గడ్డుమెట్లు ఎక్కుతూ ఉండడంవల్ల ఆ మాస్టారుగారి వెన్నెముక పగులుతూ వచ్చింది.

ఆడ పిల్లలకు ప్రాయం రావడానికి, ఎక్కువ ఆలస్యం కాదు కదా? చదువులో కొంచెం వెనకబడ్డ మొదటి ఇద్దరమ్మాయిలూ ఎలాగో కష్టపడి, మెట్రిక్యులేషన్ పాస్ అయ్యారు. తరవాతి కార్యక్రమం అదేనన్నట్లు తమకు రాబోయే రాజ కుమారులకోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు. ఎంతోమంది విద్యార్థులను గొప్ప వాళ్లుగా తీర్చి దిద్దిన మహనీయుడైన మాస్టారు కట్నం అడగకుండా పెళ్లి చేసుకోగలిగే బుద్ధిమంతులను తయారు చేయలేకపోయాడు.

మొదటి అమ్మాయి వయస్సుమళ్లి జుట్టు నెరసేముందే వివాహం చేయాలనుకొని, మరియమ్మ పేరు మీద వున్న పదిసెంట్లు పొలాన్ని అమ్మి, ఎలాగయితేనేమి వివాహం జరిపించారు. ఆ విధంగా ఆమె బయట పడింది. రెండో అమ్మాయి వయస్సుతో పాటే కళ్యాణ కాంక్ష పరంపర పెరుగుతూనే వచ్చింది. చివరికి ఆ మాస్టారుగారి ఉద్యోగ విరమణం ఆమె కళ్యాణానికి పనికి వచ్చింది. ఆ విధంగా ఆమె కూడా బయట పడింది.

పోతే, చదువులో అతి సమర్థురాలుగా వుండి, కాలేజీకి వెళ్లడానికి వీలులేక, కన్నీరు త్రాగుతూ కూర్చున్న మేరీ -

దశబ్దాలకు తరబడి ఆశపడీ పడీ చివరికి, ఆ ఆశ, చచ్చుబడిపోయి పిచ్చిదానిలా చావుకు సిద్ధం అయిన మరియమ్మ -

ఒకే ఒక ఆస్తి అని చెప్పుకోగలిగే... శిథిలావస్థలో వున్న ఆ చిన్న ఇల్లు...

...రిటైరైన ఆ పంతులు గారికి ఋణ బాధ్యతల మాదిరి మిగిలపోయాయి.

అవీ ఆస్థులే కదా?

ఎలా?

మేరీకి పెళ్లి చేసి పంపాలంటే ఎంత డబ్బు కావాలి?

మరియమ్మ రుగ్మతలు ఎంత డబ్బు ఖర్చు పెట్టిస్తాయో?

ఆ చిన్న ఇంటి పైకప్పు మార్చడానికి కావాల్సిన డబ్బు తనచేతిలో వుందా?

అంతటి వేదనా భారాన్ని మ్రింగుతున్న ఏ మనిషికయినా చిరునవ్వు వస్తుందా? ఒక మామూలు మనిషికి అది సాధ్యం కాకపోవచ్చు. కానీ, డేనియల్ మాస్టారు ముఖంలో ఈరోజు కూడా, ఆ చిరునవ్వు వుంది... పాలిపోయి, పులిసిపోయిన చిరునవ్వు అది.

యాభై ఆరేళ్ల వయస్సు, శారీరక అస్వస్థత, మనోవేదన, వీటికంతా మగ్గిపోయి పాలిపోయి పులిసిపోయిన మరియమ్మ...

తండ్రి పెన్షన్‌తో పెళ్లి అయిన రెండో అక్క ఇంటి నుంచి బయట పడ్డాక గత ఐదు సంవత్సరాల పాటు నిట్టూర్పులతో ఎగశ్వాసలతో పోరాడుతున్న చిక్కి శల్యమైన మేరి-

వందమందిని ఆ అయిదు సంవత్సరాలలో, కనీసం డేనియల్ గారి ఆ పాలి పులిసిన చిరునవ్వు మాట్లాడించింది ఎంతో కష్టపడి. అత్తగారిళ్లకు పంపించిన కూతుళ్లతో ఆ పాలి పులిసిన చిరునవ్వు కూడా ఖర్చయిపోయింది.

కానీ, మేరే పెళ్లికి సహాయం చేయడానికి ఎవరికీ వీలు కాలేదు. ఇంక ఆయనకు మిగిలిన ఐదు సెంట్ల భూమి, తనకన్నా ముసలిదయిన ఆ చిన్న ఇంటిని మూడోకూతురు వరకట్నంగా ఇవ్వడానికి ఆయన సిద్ధమయ్యాడు.

కానీ, పాలిపోయి అందంగానే ఉన్నా; సౌశీల్యం ఉన్నా -

గృహ కృత్యాల నిర్వహణలో సామర్థ్యం ఉన్నా -

ఎలాంటి చెడ్డపేరు ఇంతవరకూ సంపాదించకుండా వున్నా -

ఏ సంబంధం అయినా పురోగమించేది పెళ్లిచూపుల వఱకే.

ఆమెకు బి.ఏ. డిగ్రీలేదు. కాదనే వారికి అదొక సులువైన సాకు. ఆ విషయం తెలియకుండానే పెళ్లి ప్రస్తావన వఱకు వస్తారా?

ఆ ఇల్లు అచ్చి రాలేదు. ఒక్క చూపులోనే ఆ సంగతి అర్థమవుతుంది- ముసలి తల్లి, ముసలి ఇల్లు. ముసలి తల్లికి అంత పెద్ద వయసేమీ లేదు. కాని చూస్తే?

ఇంటిమీద కొంచెం డబ్బు మదుపు పెడితే అది ఒక నవోఢగా మారుతుంది. కాని దానికి డబ్బేది?

ఐదు సెంట్ల భూమి విలువను కూడా, ఆ పాక, జీర్ణగృహం దిగమింగేస్తూంది.

పెళ్లిళ్ల పేరయ్యల చెప్పులు అరిగి పనికిరాకుండా పోయాయి. అమ్మాయి ఆశలూ వాటితోపాటే కడగట్టాయి. అమ్మాయి తల్లికి మిగిలిన లవలేశమైన విశ్వాసం కూడా నశించిపోయింది.

అయితే, డేనియల్ మాస్టరుగారి పాలి పులిసిన చిరునవ్వు మాత్రం నశించ లేదు. కాని, అది కొంచెం వంకర పోయినట్టుగా ఉంది. అతని బాధలు ఆ నవ్వుని ఒక వైపుకేమైనా లాగుతున్నాయా?

పెళ్లిళ్ల పేరయ్య అయినా గూడా, అలాంటి పేరు (దోషం)లేని ఒకాయన అరిగిన చెప్పుల్ని తీసేసి మళ్లీ వేసుకోవాల్సి వచ్చినా, తిరిగి తిరిగి డేనియల్ మాస్టారి

ఇద్దరమ్మాయిల పెళ్ళిళ్లు చేయడంలో ప్రధాన పాత్ర వహించాడు. అయితే, ఆయనే మళ్ళీ గత ఐదు సంవత్సరాల నుంచి చెప్పులు అరిగిపోతున్నా మళ్ళీ కొత్త చెప్పులు వేసుకొని మారథాన్ పరుగు సాగిస్తూనే ఉన్నాడు.

ఒకరోజు ఉదయం ''బ్రాండ్ న్యూ'' చెప్పులు తొడుక్కుని కొత్త దుస్తులు కూడా ధరించి, ఒక దేవదూత రూపంలో ఆ పేద ఇంటిలో ప్రత్యక్షమయ్యాడు.

జేకేబన్న, నూతన వస్త్రాలకు, కొత్త చెప్పులకు వెనుక, ఆంథోని షావుకారు గొప్ప మనస్సు వుంది. వారి దానశీలత, స్నేహతత్పరత, ఎప్పటినుంచో ఊరిలో పేరెన్నిక పొందింది. అలాంటి మంచి వాళ్లనే కదా, దైవం కఠిన పరీక్షకు గురి చేసేది?

ఆంథోని షావుకారి తండ్రి జన్మతః ఒక గొప్ప ధనవంతుడు. దానికి ముఖ్యకారణం ఆయనకు తోబుట్టువులు ఎవరూ లేకపోవడమే. అతనికి ఎన్నో ఫ్యాక్టరీలు, పంట పొలాలు కూడా వున్నాయి. తన తరంలోనే వాటిని రెండింతలు చేసుకున్నాడు. కాని సంతతి విషయానికొస్తే, ఆయన పేదవాడే అని చెప్పాలి. ఆంథోని ఒక్కడే ఆయన సంతానం. రెండు తరాలుగా ఏక సంతానంగా ఉన్న ఆ కుటుంబంలో, చరిత్ర మరొకసారి పునరావృత్తమయింది. ఆంథోని షావుకారికి ప్రథమ సంతానంగా కొడుకు పుట్టేసరికి, అతని ఆనందానికి అవధి లేకుండా పోయింది. ఆ బంగళాలో బిడ్డడి జన్మవేడుక, తరువాత జన్మదినాలు ఎంతో కన్నుల పండుగగా జరిగాయి. ఆ వేడుకులు, బంగ్లాకే పరిమితం కాకుండా, ఆ ఊళ్లో వున్న బీదసాదలందరికీ మృష్టాన్న భోజనము, ఆరోజు దొరికేది. ఆ కొడుక్కి, ఆంథోని తండ్రి పేరు ఆశీర్వాదం అనే పెట్టుకున్నాడు. ఎంతో పిసినారి అయిన తాత ఆశీర్వాదం షావుకారికి వ్యాపార పరంగా రాక్షస బుద్ధితో వ్యవహరించేవాడు. మనువడు ఆశీర్వాదానికి నాలుగైదేళ్లు వచ్చేసరికి, ఆంథోని షావుకారికి ఎంతో సాధుస్వభావి అయిన ఆయన సహధర్మచారి ణికి మనో దౌర్బల్యం కలిగించే ఒక క్రూరమైన సత్యం మెల్ల మెల్లగా తెలిసి వచ్చింది. పుట్టుకతోనే, ఆశీర్వాదానికి కొంచెం బుద్ధిమాంద్యం ఉందని డాక్టర్లు చెప్పారు. కాని, వైద్య శాస్త్రంపైన వాళ్లకుండే విశ్వాసం, దానికంటే ఎక్కువగా దేవుడిపై వారికున్న నమ్మకం, తమకు ఒక మంచి రేపు వస్తుందనే శుభకరమైన విశ్వాసాన్ని తోడుంచాయి. జీవితాన్ని ముందుకు సాగించడానికి అది శక్తి నిచ్చింది. ఆరేళ్లు వచ్చిన తరువాత ఆ బిడ్డను బెంగుళూరులో వున్న ఒక ప్రత్యేకమైన స్కూల్లో చేర్చినప్పుడ, ఆంథోని షావుకారు ఒంటరి వాడు అయ్యాడు. కారణమేమిటంటే వారి ధర్మపత్నికి ఆ బిడ్డనుండి దూరంగా వుండడం ఇష్టం లేదు. దాదాపు ఐదు సంవత్సరాలపాటు అక్కడ చదివిన ఆశీర్వాదంలో ఏదో కొద్దిపాటి మెరుగుదల ఉన్నట్లు ఆ స్కూల్లో చాలా మంది అభిప్రాయపడ్డారు. ఆ విషయంలో అదే అభిప్రాయాన్ని అవలంభించిన ఆంథోని

షావుకారు, ధర్మపత్నీ అబ్బాయిని తిరిగి ఇంటికి తీసుకపోవడంలో తప్పు లేదని అనుకున్నారు. భార్య, కొడుకు కొఱకు తిరిగి, తిరిగి ఆంథోని బాగా అలసిపోయాడు. వారానికి మూడురోజులు పాటు బెంగుళూరులో వుంటున్న కారణంగా, వ్యాళ్లో వ్యాపారం గుఱించి ఆయనకు చాలా బాధగా వుండేది. ఇంకో ఐదు, పది సంవత్సరాలు, ఆశీర్వాదం బెంగుళూరు స్కూల్లో వుంచినా అతనిలో అంత పెద్ద మార్పు రాదని ఆ దంపతులు అర్థం చేసుకున్నారు. ఆ కారణంగా వాళ్లు తిరిగి వచ్చేశారు. ప్రతిరోజు ఇంటికి ఒక మాస్టారు వచ్చి, ఆశీర్వాదానికి చదువు చెప్పేవాడు. రూపాన్ని చూస్తే, ఆ అబ్బాయికి బుద్ధిమాంద్యం వుందని ఎవరూ అనుకోరు. ఇంగ్లీషులోగాని, తెలుగులో గాని మాట్లాడేటప్పుడు మాటలు అంత స్పష్టంగా లేకపోవడం వల్ల, అతనికి బుద్ధి మాంద్యం ఉందని అర్ధమౌతుంది.

ఆ ఆశీర్వాదానికి ఇప్పుడు ఇరవై ఎనిమిదేళ్లు వచ్చాయి. ఆంథోని దంపతులకు అబ్బాయికి పెళ్లి చేయాలని ఎంతో ఆశపడ్డారు. కాని, అమ్మాయిని ఎవరిస్తారు? చాలా మంది పేరయ్యలు బీద కుటుంబాలకు వెళ్లి వెతికారు. కాని, ఫలితం శూన్యం.

అలా వుండగా ఒకరోజు ఆంథోని షావుకారికి ఆహ్లాదం కలుగజేయడానికి, జేకబన్న పరుగెత్తి కొచ్చాడు. తాను చెప్పే ఏ విషయాన్నయినా, డేనియల్ మాస్టారు, అలాగే ఒప్పుకుంటాడని ఆయన చెప్పడంతోటే, నూతన వస్త్రాలు, పాదుకలు, కొంతడబ్బు అతని చేతిలోకి ఎగిరి పడ్డాయి.

వివరాలన్నీ జేకబన్న చెబుతుంటే మరియమ్మ కూడా విన్నది. వాటిలో అంత దార్థం తెలియడంతో ఆమె ఒక్కసారిగా ఏడ్చేసింది. ఆమెను కొంచెం ఓదార్చిన తర్వాత డేనియల్ మాస్టరు,

''జేకబన్నా, ఆంథోని షావుకారు ఇంటితో సంబంధం కలుపుకోవడం అంటే కలలోకూడా ఊహించ లేనిది. మా అమ్మాయి అక్కడ ఒక మహారాణిగా బ్రతకడమే కాకుండా, మా కష్టాలు కూడా పూర్తిగా తొలగిపోతాయి. ఆంథోని అంత పెద్దమనిషి అడిగితే, నేను, నా ప్రాణం ఇవ్వడానికి కూడా సిద్ధంగా వున్నాను, కానీ మా అమ్మాయి ఒక మంద బుద్ధితో జీవిత కాలమంతా గడపాలంటే, దానికంటే పెద్ద శిక్ష ఇంకేదైనా వుందా? అదిగూడా పోనీయండి. ఆమెకు ఒక బిడ్డ పుడితే, ఆ బిడ్డకూడా ఆశీర్వాదం లాగా వుంటే ఆమె జీవితానికి ఏమైనా అర్థముంటుందా?''

''అదేమైనా మన చేతుల్లో వుందా మాస్టరు గారూ అంతదూరం ఆలోచించడం అనవసరం. మేరీకి వయసు ఇప్పుడెంత? అనేదాన్ని గుఱించే ఇప్పుడు ఆలోచించాలి. అదీ కాకుండా, ఈ సంబంధం కలుపుకంటే, మీ కష్టాలన్నీ గట్టెక్కుతాయి గదా.

మన జీవితకాలం ఎంత వరకుంటుంది? దానిలో, కనీసం పదిరోజులైనా కష్టాలు అనుభవించకుండా బ్రతికి చచ్చిపోతే, అందులోనే ఒక తృప్తి వుంటుంది. అలా కాకుండా, జీవితకాలమంతా అనుభవించి, చివరికి, దారిద్ర్యంతోనే చనిపోతే మనమెందుకు పుట్టినట్లు? అని అనుకోవలసి వస్తుంది గదా! ఒకటో రెండో సంవత్సరాల తర్వాత జరగబోయే విషయం గురించి ఈ రోజునుంచే ఆకలితో చావాలా? ఆ ఆశీర్వాదానికి పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా వుండదు అని ఎవరైనా గట్టిగా చెప్పగలుగుతారా? యేసు ప్రభువు కరుణను నమ్మండి మాస్టారూ''.

''జేకబన్నా నీవు చెప్పేదంతా నిజమే. కాని, నా మేరీ మనసు నొప్పించే పని నేను ఏదీ చేయను. కూటికి లేని స్థితిలోవున్నా మేం ముగ్గురం సంతోషంతో గడుపుతున్నాం. అంతేగాని...

డేనియల్ మాస్టరు ఇంకా మాట్లాడబోయే ముందు, తలుపు చాటున దాక్కుని, బయట సంభాషణ అంతా వింటున్న మేరీ అమ్మను లోపలికి పిలిచింది. వెక్కుతూనే కూతురు దగ్గరకు వెళ్లిన ఆ తల్లిని ఆమె గాఢంగా హత్తుకుంది.

''అమ్మా, ఈ పెళ్లి నాకు సమ్మతమే. నాకు ఇది చాలు''

''అయ్యో... తల్లీ... తల్లీ...

''అవునమ్మా, అన్నీ ఆలోచించిన తర్వాతనే నేను ఈ నిర్ణయాని కొచ్చాను. జేకబన్న చెప్పింది అక్షరాలా నిజమే. మనం కనీసం కొంతకాలమైనా సుఖంగా బ్రతుకుతాము.''

''కానీ మేరీ, ఆ ఆశీర్వాదానికి...''

''అమ్మా, అతనికేం తక్కువ? నీకు అలాంటి ఒక కొడుకుంటే, మీరతనికి పెళ్లి చేయరా? అతనికి అండదండగా వుండటంలో నాకు సంతోషంగానే ఉంటుంధి. అమ్మా ఇక ఆలోచించడానికి ఏమీ లేదు.''

''కాని మేరీ, నీ బిడ్డ కూడ అలాగే పుడితే?

''అది ఇప్పుడు వెంటనే జరిగే పని కాదు గదా? ముందు మన దారిద్ర్యాన్ని అంతం చేయాలి.''

''కాని, అమ్మా, నీ బిడ్డ...

''ఎక్కడుంది నా బిడ్డ? అలాంటి ఒక బిడ్డ పుట్టకుండా వుంటే చాలుగదా!''

''అయితే నీకు తల్లి గావాలనే లేదమ్మా?''

''వుందమ్మా! నాకు మంచి ఆరోగ్యంగల పిల్లలే పుడతారు.''

''కాని, ఆశీర్వాదానికి...

''అవునమ్మా అదే నేను చెప్పేది. ఆశీర్వాదం నుంచి నాకు పిల్లలు పుట్టకుండా వుంటే చాలుకదా.''

మరియమ్మ నిశ్చేష్టురాలైపోయింది. తన కడుపులో నుంచి పుట్టిన బిడ్డ ఇలా మాట్లాడుతుందా అని ఆశ్చర్యపోయింది. మేరీ మెదడు కూడా, ఆశీర్వాదం మెదడు లాగా అయిపోయిందా అని ఆమె భయపడింది.

ఏమైనాగాని, ఇంకా కొంచెం సేపు మాట్లాడిన తర్వాత ఆ పెళ్లి విషయంలో, కూతురు మనసు మార్చడం తల్లికి సాధ్యం కాలేదు.

తర్వాత ఏమేమి జరిగింది అని ఇంక వివరించడం అనవసరం.

ప్రతి మంచి కథ ముగింపు మాదిరి ''వాళ్లు తమ శేష జీవితాన్ని హాయిగా గడిపారు.''

మేరీ ఆశీర్వాదం దంపతుల పిల్లలు కూడా!